# బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శుక్రవారం 29 నవంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4


## పదో తరగతి పరీక్షల్లో కీలక మార్పులు

- ఇంటర్నల్ మార్కుల విధానం రద్దు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పదో తరగతి మార్కుల విధానంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈసారి ఇంటర్నల్ మార్కుల విధానాన్ని పూర్తిగా రద్దు చేసింది. ఇకపై 100 మార్కులకు ఫైనల్ పరీక్షలు జరగనున్నాయి.. ఇప్పటి వరకు 80 మార్కులకు వార్షిక పరీక్ష జరగగా 20 మార్కులు ఇంటర్నల్ కోసం కేటాయించారు. అయితే సర్కార్ తాజా నిర్ణయంతో 100 మార్కులకు ఫైనల్ పరీక్షలు జరగనున్నాయి. ఈ విద్యా సంవత్సరం నుంచే ఈ నిర్ణయం అమల్లోకి రానుంది.

## విద్యార్థులను సొంత బిడ్డల్లా చూడాలి

- పౌష్టికాహారం అందించాలి
- ఉదాసీనంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం
- పాఠశాలలు, గురుకులాలను కలెక్టర్లు తరచూ తనిఖీ చేయాలి
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకుల విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులను సొంత బిడ్డల్లా చూడాలని, వారికి పరిశుభ్రమైన వాతావరణంలో పౌష్టికాహారం అందించే విషయంలో ఎటువంటి అలక్ష్యానికి తావు ఇయ్యరాదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు.

బడి పిల్లలకు అందించే ఆహారానికి సంబంధించి ఘటనలు పునరావృతం కావడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి ఈ విషయంలో ఉదాసీనంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు రుజువైతే వారిని ఉద్యోగాల నుంచి తొలగించేందుకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. కలెక్టర్లు తరచూ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకులాలను తనిఖీ చేసి, నివేదికలను సమర్పించాల్సిందే అని ఆదేశించారు.

గడిచిన పదేండ్లలో గాడితప్పిన విద్యా వ్యవస్థను తిరిగి దారిలో పెట్టే క్రమంలో ప్రస్తుత ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. విద్యార్థినీ విద్యార్థుల విషయంలో సానుకూల నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ కొందరు దురుద్దేశంతో ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, లేనివి ప్రచారం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి గారు అధికారులను ఆదేశించారు.



### సర్వేలో వివరాలు నమోదు చేయించుకున్న సీఎం

యావత్ దేశానికి మార్గాన్ని నిర్దేశిస్తూ తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరాలు నమోదు చేయించుకున్నారు.

హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ , జీహెచ్ఎంసీ కమీషనర్ ఇలంబర్తి, ఇతర అధికారులు, ఎన్యుమరేటర్లు, సిబ్బందితో కూడిన సర్వే బృందం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి గారి కుటుంబ వివరాలను నమోదు చేసుకున్నారు.

సర్వే పురోగతి వివరాలను, సర్వేలో పాల్గొన్న ప్రజల స్పందన గురించి అధికారులను అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి గారు, వీలైనంత త్వరగా కుల సర్వే పూర్తి చేసేలా కార్యాచరణ ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు తప్పనిసరిగా సర్వేలో వివరాలు నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి గారు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ పరిధిలో వీవీఐపీలు, ఐఏఎస్, ఐపీఎస్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధుల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు.

## ఫుడ్ పాయిజన్ వెనుక కుట్ర

- మంత్రి సీతక్క సంచలన వ్యాఖ్యలు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఇటీవల తెలంగాణలోని పలు గిరిజన హాస్టళ్లు, మిడ్ డే మిల్స్‌లో ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటుచేసుకుంటున్న సంగతి తెలిసిందే. పలువురు విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. తాజాగా, ఈ ఘటనలపై మంత్రి సీతక్క సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫుడ్ పాయిజన్ వెనక కుట్ర ఉందని ఆరోపించారు. అయితే కుట్ర వెనక ఎవరున్నా వదలేది లేదని హెచ్చరించారు.

అలాగే ఇథనాల్ కంపెనీకి అన్ని అనుమతులు ఇచ్చింది బీఆర్ఎస్ నాయకులేనని అన్నారు. దిలావార్ పూర్ వస్తే తప్పెవరిదో తేల్చుకుందాం అంటూ మంత్రి సీతక్క కేటీఆర్‌కు సవాల్ విసిరారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను తమ ప్రభుత్వంపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇథనాల్ కంపెనీలో డైరెక్టర్లుగా మాజీ మంత్రి తలసాని కుమారుడు తలసాని సాయి ఉన్నాడని తెలిపారు.

## ప్రజాపాలనలో ప్రశ్నిస్తే కేసులా

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రజాపాల నలో ప్రశ్నిస్తే కేసులు పెడతారా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. బడి పిల్లలకు బాసటగా నిలిచిన బీఆర్ఎస్వీ నాయకుల అక్రమ అరెస్ట్ అప్రజాస్వామికమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. విద్యార్థి నాయకులకు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం అరెస్టు చేసి ఇప్పటికీ తమ విద్యార్థి నాయకుల జాడ చెప్పకుండా రాత్రంతా తిప్పుతారా అని ప్రశ్నించారు. సమస్యలపై నిలదీస్తే నిర్బంధాలా, బడిపిల్లలకు బాసటగా నిలిస్తే అరెస్ట్ చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పురుగుల అన్నం పెడుతున్నారని ప్రశ్నిస్తే కేసులు పెడ్తారా అని విమర్శించారు. గురుకుల సమస్యలపై, విద్యార్థుల ఆత్మహత్యలు, పిల్లల మరణాలపై గళమెత్తితే గొంతు నొక్కుతారా అని ప్రశ్నించారు. మా బీఆర్ఎస్వీ నాయకులు గురుకుల బాట పాడుతాం అంటే అడ్డుకుంటారా అంటూ ఎక్స్ వేదికగా ఫైర్ అయ్యారు. అరెస్టు చేసిన వానికి తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

గురుకులాలు, జడ్పీ స్కూళ్లల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలకు నిరసనగా మాసబ్‌ట్యాంక్‌లోని సంక్షేమ భవన్ వద్ద బీఆర్ఎస్వీ నేతలు బుధవారం మెరుపు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పోలీసులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ సహా విద్యార్థి నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. గెల్లు శ్రీనివాస్‌యాదవ్ మాటాడుతూ రాష్ట్రంలో విద్యార్థుల మరణాలు, ఆత్మహత్యలు కాంగ్రెస్ ప్రభుత్వ హత్యలేనని విమర్శించారు. కేసీఆర్ హయాంలో దేశానికే దిక్సూచిగా నిలిచిన తెలంగాణ గురుకులాలు.. కాంగ్రెస్ ఏడాది పాలనలోనే అస్తవ్యస్తంగా మారాయని ఆందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరు వల్ల విద్యార్థుల తల్లిదండ్రులకు గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లపై నమ్మకం పోతున్నదని తెలిపారు. సర్కార్ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ త్వరలో రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్వీ పర్యటిస్తుందని తెలిపారు.

## ఫుడ్ పాయిజన్‌పై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

- ముగ్గురు సభ్యులతో ఆహార నాణ్యత పరిశీలన
- హాస్టళ్లు, గురుకులాలు,అంగన్‌వాడీల్లో కమిటీలు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలోని గురుకులాలు, పాఠశాలల్లో వరుసగా ఫుడ్ పాయిజన్ ఘటనలు వెలుగులోకి వస్తుండటం.. రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. కుమురం భీ ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన శైలజ అనే విద్యార్థిని ప్రాణాలు కోల్పోవటం.. నారాయణపేట జిల్లాలోని మాగనూరు పాఠశాలలో వారం రోజుల వ్యవధిలోనే మూడుసార్లు ఫుడ్ పాయిజన్‌లో విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురికావటం ప్రస్తుతం ఆందోళనకరంగా మారింది. అయితే.. ఈ ఘటనల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఆహార నాణ్యతపై దృష్టి సారించిన ప్రభుత్వం ఫుడ్ పాయిజన్‌కు కారణాలు తేల్చేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసింది. ముగ్గురు సభ్యులు ఉండే ఈ కమిటీలో ఒక ఫుడ్ సేఫ్టీ కమిషనర్, ఓ అదనపు డైరెక్టర్, ఒక జిల్లా స్థాయి అధికారి ఉంటారు.

గురుకులాలు, హాస్టళ్లలో ఆహార నాణ్యతను ఈ బృందం పరిశీలించనుంది. వీటితో పాటు అంగన్‌వాడీలు, ఆసుపత్రుల్లో ఆహార నాణ్యతనూ పర్యవేక్షించనుంది. ఫుడ్ పాయిజన్ జరిగినప్పుడు కారణాలు తేల్చి, బాధ్యులను గుర్తించనుంది. ఈ మేరకు సీఎస్? శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

### పాఠశాలల్లో ముగ్గురితో కమిటీలు

గురుకులాలు, అంగన్ వాడీలు, సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. ఇందుకోసం అన్ని విద్యాసంస్థల్లో ఫుడ్ సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపింది. ఈ కమిటీల్లో ప్రధానోపాధ్యాయుడితో పాటు ఇద్దరు సిబ్బంది సభ్యులుగా ఉంటారు. వీళ్ల వంట ప్రారంభానికి ముందు కిచెన్ ను పర్యవేక్షించాల్సి ఉంటుంది. నాణ్యమైన సరుకులతోనే వంట చేస్తున్నారా..? అనే అంశాన్ని నిర్ధారించిన తర్వాతే కుకింగ్ జరగాలి. భోజనం సిద్ధమైన తర్వాత హెడ్ మాస్టర్, ఇద్దరు సభ్యులు రుచి చూసిన తర్వాతే విద్యార్థులకు అందించాలని సీఎస్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## పార్లమెంట్‌లో మళ్లీ గందరగోళం




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పార్లమెంట్ ఉభయసభల్లో గురువారం కూడా రభస కొనసాగింది. అమెరికాలో అదానీ సంస్థపై కేసుకు సంబంధించి చర్చ చేపట్టాలని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు డిమాండ్ చేయడంతో ఉభయసభల్లో గందరగోళం నెలకొంది. దాంతో ముందుగా ఉభయసభలను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. మధ్యాహ్నం 12 గంటలకు సభలు పునఃప్రారంభమైన తర్వాత కూడా ఉభయసభల్లో మళ్లీ అలాగే ఉండడంతో సభలు రెండు శుక్రవారానికి వాయిదాపడ్డాయి.

### కొత్త ఎంపీలు ప్రమాణస్వీకారాలు

ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో కొత్తగా ఎన్నికైన ఎంపీలు ప్రమాణస్వీకారాలు చేశారు. వాయనాడ్ ఎంపీగా కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకురాలు ప్రియాంకా గాంధీ వాద్రా, నాందేడ్ ఎంపీగా రవీంద్ర వసంత్‌రావు చవాన్ ప్రమాణం చేశారు. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా వారి చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఆ తర్వాత ప్రతిపక్షాలు అదానీ అంశంపై చర్చకు పట్టుబట్టడంతో రేపటికి వాయిదా వేశారు. రాజ్యసభలో కూడా అదే పరిస్థితి నెలకొనడంతో రేపటికి వాయిదా పడింది.

## రాజ్యాంగాన్ని చేతబూని ఎంపీగా ప్రియాంక ప్రమాణం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

లోక్‌సభ ఎంపిగా ప్రియాంక గాంధీ ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం ఉదయం లోక్‌సభ సమావేశం కాగానే ఆమె చేత లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రమాణ స్వీకారం చేయించారు. గురువారం తొలుత తల్లి సోనియా గాంధీ, సోదరుడు రాహుల్ గాంధీతో కలిసి ప్రియాంక పార్లమెంట్‌కు చేరుకున్నారు. లోక్‌సభలోకి ప్రవేశించిన తరువాత లోక్‌సభ సెక్రటరీ జనరల్ ప్రియాంక గాంధీ పేరు పిలవగానే ఆమె చేతిలో రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకొని స్పీకర్ పోడియం వద్దకు వెళ్లారు. రాజ్యాంగ ప్రతిని చూపిస్తూ ప్రమాణ స్వీకారం చేశారు. తొలిసారి లోక్‌సభలో అడుగుపెట్టడం తకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి సోనియా, రాహుల్‌తోపాటు ప్రియాంక పిల్లలు రైహాన్ వాద్రా, మిరయా వాద్రా కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా తన తల్లికి శుభాకాంక్షలు తెలిపారు. కేరళలోని వాయనాడ్ నుంచి కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఎంపిగా గెలుపొందారు.

## హైదరాబాద్ వేదికగా ఖేలో ఇండియా




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు ఖేలో ఇండియ 2026 పోటీలను హైదరాబాద్‌లో నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. వచ్చే ఏడాది నిర్వహించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేసినా.. 2025లో బీహార్‌లో నిర్వహించాలని ఇప్పటికే నిర్ణయించడంతో 2026లో హైదరాబాద్‌లో నిర్వహించేందుకు కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్‌సింగ్ మాండవియా సానుకూలంగా స్పందించి సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డికి హామీ ఇచ్చారు. రాతపూర్వక విజ్ఞప్తిని జితేందర్‌రెడ్డి గురువారం కేంద్ర మంత్రికి అందజేసి వివరించగా స్పష్టత లభించింది.ముఖ్యమంత్రి రేవంత్ విజ్ఞప్తిని కేంద్ర మంత్రికి వివరించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి అంతర్జాతీయ స్థాయిలో మన దేశానికి క్రీడారంగంలో గుర్తింపు, పేరు ప్రఖ్యాతులు వచ్చేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాల్సిన అవసరాన్ని వివరించారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నందుకు కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.తెలంగాణ ఒక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ఆర్థికంగా మాత్రమే కాక అనేక రంగాల్లో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ప్రత్యేక గుర్తింపు సాధించిందని, ఇకపైన క్రీడా పోటీల నిర్వహణతో పాటు భవిష్యత్తు లో ఉత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన అవగాహనతో ఉన్నదని జితేందర్ రెడ్డి గుర్తుచేశారు.కేంద్ర మంత్రితో జరిగిన ఈ సమావేశంలో జితేందర్ రెడ్డితో పాటు ఎంపీలు డాక్టర్ మల్లు రవి, అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రామసహాయం రఘురామ్‌రెడ్డి తదితరులు కూడా పాల్గొన్నారు.

## కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ప్రజలకు రైల్వేశాఖ గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రానికి రైల్వే శాఖ తీపి కబురు చెప్పింది. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఆదేశాలిచ్చింది. అలాగే మరోవైపు ప్రస్తుతం అక్కడ ఉన్న ఓవర్‌హాలింగ్ వర్క్‌షాప్‌ను మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌గా అప్ గ్రేడ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఇక అప్‌గ్రేడ్ చేయాలని 2023 జులై 5న రైల్వే బోర్డు దక్షిణ మధ్య రైల్వే జీఎంకి లెటర్ రాసింది. ఈ నేపథ్యంలోనే అప్‌గ్రేడ్ చేసిన యూనిట్‌లో ఎల్‌హెచ్‌బీ, ఈఎంయూ కోచ్‌లు తయారు చేసేందుకు వీలుగా యూనిట్‌ను డెవలప్ చేయాలని ఈ సంవత్సరం అంటే 2024 సెప్టెంబరు 9న రైల్వే బోర్డు ఆదేశాలిచ్చింది.

ఈ మేరకు కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌లో LHB, EMU కోచ్‌ల తయారీకి సౌకర్యాలను డెవలప్ చేయడానికి ఒక ప్లాన్ రూపొందించాలని రైల్వే బోర్డు సూచించింది. ఇక విభజన హామీల అమలుపై రాష్ట్ర అధికారులు, కేంద్ర అధికారులతో హెూంశాఖ నిర్వహించిన భేటీలో ఈ విషయం వెల్లడైంది.

## నిరూపిస్తే కంపెనీని వారికే రాసిస్తా



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రతిపాదిత ఇథనాల్ కంపెనీకి, తమ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని ఆ కంపెనీతో తమకు సంబంధం ఉన్నట్లు నిరూపిస్తే వారికే రాసిస్తా - మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బాధ్యత గల హెూదాలలో వ్యక్తులు వాస్తవాలు తెలుసుకోకుండా నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. తమ కుటుంబ సభ్యులపై పిసిసి చీఫ్, మంత్రి సీతక్క, ఎంపి చామల చేసిన ఆరోపణలను ఖండిస్తున్నానని పేర్కొన్నారు. భవిష్యత్‌లో తమపై ఆరోపణలు చేస్తే న్యాయపరంగా ముందుకెళ్తామని హెచ్చరించారు. ప్రభుత్వం రైతుల ఆందోళనను పరిష్కరించే ప్రయత్నం చేయాలి కానీ.. బీఆర్ఎస్‌ను, వ్యక్తులను బదనాం చేయాలని ప్రయత్నం తగదని ఆక్షేపించారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, బీఆర్ఎస్ నేతలతో కలిసి తలసాని శ్రీనివాస్ యాదవ్ మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం తమ అసమర్ధతను కప్పి పుచ్చుకునేందుకే తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా, కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని మండిపడ్డారు. ఇథనాల్ కంపెనీకి కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అనుమతులు ఇస్తుందని, బీఆర్ఎస్ ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని పేర్కొనడం విడ్డూరం అని పేర్కొన్నారు. ఏపీలో టిడిపి ప్రభుత్వం ఉన్నప్పుడు.. 2016లో రాజమండ్రి ప్రాంతంలో తన కుమారుడు కంపెనీని పెట్టాలనుకున్నారని, అయితే మూడు నెలలకే కంపెనీ డైరెక్టర్ పదవికి రాజీనామా చేశారని చెప్పారు.కాంగ్రెస్ నేతలు చెబుతున్న పిఎంకె కంపెనీ నుంచి తన కుమారుడు ఎనిమిదేళ్ల క్రితమే తప్పుకున్నారని అన్నారు.

## ప్రజలు, పార్లమెంటును మోసం చేసిన సీఎం రేవంత్ రెడ్డి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రజలు, పార్లమెంటును సీఎం రేవంత్ రెడ్డి మోసం చేశారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. మూసీ ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం వాస్తవాలను దాచిపెడుతోందని అన్నారు. భూసేకరణ చట్టం

మిగితా 3వ పేజీలో

# కేసుల విచారణలో జాప్యం చేయకుండా బాధ్యతగా వ్యవహరించాలి..



- **అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి.**
- **ఎస్పీ అఖిల్ మహాజన్**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

కేసుల విచారణలో జాప్యం చేయకుండా పోలీస్ అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలని,పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మినీ కాన్ఫరెన్స్ హాలు లో సిరిసిల్ల సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో ఎస్పీ అఖిల్ మహాజన్ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ప్రతి కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్ష పడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని అన్నారు .ప్రాసిక్యూషన్ లో భాగంగా కోర్టు వారు జారిచేసిన నాన్ బెయిలబుల్ వారెంట్లను నిందితులపై లేదా తప్పించుకుని తిరుగుతున్న నేరస్తులపై అమలుపరచడానికి అధికారులు అందరూ కృషి చేయాలనిఅన్నారు . ప్రతి పోలీస్ పోలీస్ స్టేషన్ల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించి వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తూ చర్యలు తీసుకోవాలని,నిషేధిత గంజాయి,పీడీఎస్ బియ్యం అక్రమరవాణా,జూదం లాంటి కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలనిఅన్నారు .జిల్లా వ్యాప్తంగా గంజాయి రవాణా చేసే వ్యక్తులతో పాటు గంజాయిని సేవించే వారిని గుర్తించి కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకోవాలని అన్నారు .

పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి(బ్లాక్ స్పాట్స్),వాటి నివారణకై సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని,ట్రాఫిక్ నియమాలను పాటించకుండా మద్యం సేవించి వాహనాలను నడుపుతూ,ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేయాలని అన్నారు . ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సి.ఐ లు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, మధుకర్, శ్రీలత, ఎస్.ఐ లు ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## మండలంగా మల్లంపల్లి.. ఉత్తర్వులు జారీ

**బలగం టీవీ , హైదరాబాద్**




ములుగు నియోజకవర్గంలోని మల్లంపల్లి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే మల్లంపల్లిని మండలంగా ఏర్పాటవడంతో స్థానిక ఎమ్మెల్యేగా సీతక్క హర్షం వ్యక్తం చేశారు. మండలం కోసం అలుపెరగని పోరాటం చేసి మండలాన్ని సాధించుకున్న మల్లంపల్లి ప్రాంత ప్రజలకు ఈ సందర్భంగా సీతక్క శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. 'మల్లంపల్లి ప్రాంత ప్రజల పదేండ్ల ఆకాంక్ష. మల్లంపల్లి ప్రత్యేక మండలం కోసం ప్రజలు పదేళ్లుగా ఎన్నో పోరాటాలు చేశారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి పాదయాత్ర చేసి మల్లంపల్లి మండల ఏర్పాటు చేస్తామని మాటిచ్చారు. ఇప్పుడు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు' అని సీతక్క తెలిపారు.

## పత్రిక విలేకరి ముసుగులో కాంగ్రెస్ కార్యకర్త..!

**బలగం టీవీ , ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఓ పత్రిక విలేకరిని కాంగ్రెస్ పార్టీ నాయకులు మందలించారు. మండల కేంద్రానికి చెందిన ఓ పత్రిక విలేఖరి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా చలామణి అవుతూ మండల కేంద్రంలోని పదో వార్డులో 6 నెలల కింద ధ్వంసమైన" మురికి కాలువను ఫోటో వాడుకొని గురువారం ప్రస్తుతం ధ్వంసం అయింది" అంటూ తప్పుడు వార్త రాసడని తెలిసింది. సదరు వ్యక్తులు సీనియర్ నాయకులకు ఫిర్యాదు చేయగా అతన్ని పిలిపించుకొని కాంగ్రెస్ పార్టీలో ఉంటావా పత్రిక విలేకరుగా కొనసాగిస్తావా ఏదో ఒకటి ఎంచుకో నీకు ఇష్టం వచ్చినట్లు వార్తలు రాస్తూ పార్టీ పరువు తీస్తే మాత్రం పార్టీ విడవచ్చు మందాలిచారని తెలిసింది. దాంతో ఆ నాయకుడు అక్కడ నుంచి జారుకున్నాడని సమాచారం. ఒకే వ్యక్తి పార్టీ కార్యకర్తగా పత్రిక విలేకరిగా పనిచేస్తూ ఇష్టం వచ్చిన వార్తలు రాస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ రాక్షస ఆనందం పొందుతున్నాడని పలువురు ఆరోపించారు.

# రైతు పండగ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలి

- **మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్**

**బలగం టీవీ , బోయినిపల్లి**

తెలంగాణ రాష్టంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన అధికారంలోకి వచ్చి ఏడాది కాలంలోచేసిన 2 లక్షల రుణమాఫీ సందర్భంగా రైతుల పండుగను మన పండుగ తెలంగాణ రాష్ట్ర పండగగా మండలంలో ప్రతి గ్రామంలో రైతులు ఘనంగా నిర్వహించాలని.. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ అన్నారు. అలాగే సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ ఇవ్వడం, ప్రజా పాలనలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పేదలకు ఆరోగ్య శ్రీ పథకం ద్వారా 10 లక్షల రూపాయల వరకు ఉచితంగా వైద్యం కల్పించడం జరుగుతుందని చెప్పారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మహాలక్ష్మి పథకం 200 యూనిట్ల ఉచిత గృహ విద్యుత్ ఇవ్వడం, నిరుద్యోగులకు 55 వేల ఉద్యోగంలు ఇవ్వడం, గ్యాస్ సిలిండర్ 500 రూపాయలకే ఇవ్వడం జరిగింది. ఈ నెల 30 తారీఖున మహబూబ్ నగర్ లో జరిగే రైతుల పండుగ భారీ బహిరంగ సభకు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు ఎండీ బాబు, మెరుపుల మహేష్, గంగిపెల్లి లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.




## మంత్రి కొండా సురేఖకు నాంపల్లి కోర్టు సమన్లు

**బలగం టీవీ, హైదరాబాద్**



రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు నాంపల్లి కోర్టు సమన్లు జారీ చేసింది. టాలీవుడ్ హీరో నాగార్జున వేసిన పరువునష్టం కేసులో మంత్రి సురేఖకు కోర్టు సమన్లు జారీ చేసింది. ఈ కేసు విచారణను నాంపల్లి కోర్టు డిసెంబర్ 12వ తేదీకి వాయిదా వేసింది. డిసెంబర్ 12న జరిగే విచారణకు హాజరు కావాలని మంత్రి సురేఖను కోర్టు ఆదేశించింది.

టాలీవుడ్ అగ్ర నటి సమంతతో పాటు, అక్కినేని కుటుంబంపై తెలంగాణ మంత్రి కొండా సురేఖ అనుచిత వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. అయితే కొండా చేసిన వ్యాఖ్యలకు గాను హీరో అక్కినేని నాగార్జున పరువునష్టం దావా వేశారు. తన కుటుంబ పరువుకు భంగం కలిగించారని.. తమ కుటుంబ సభ్యుల గౌరవాన్ని, ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఆమె వ్యాఖ్యలు చేశారంటూ పిటిషన్ దాఖలు చేశారు. మంత్రి కొండాసురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని నాంపల్లి కోర్టును ఆశ్రయించారు.

## నేడు ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్**



రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి ఢిల్లీ వెళ్లనున్నారు.శుక్రవారం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం జరగనుంది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ హస్తినకు బయల్దేరనున్నారు. కాగా, ఈ సమావేశానికి ఏఐసీసీ పెద్దలు, పార్టీ అగ్రనేతలు, కాంగ్రెస్ పాలిత ముఖ్యమంత్రులు హాజరుకానుండగా.. ఈ సమావేశంలో రేవంత్ రెడ్డి కూడా పాల్గొననున్నారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కూడా హాజరుకానున్నారు.

## లగచర్ల కేసులో పట్నం నరేందర్‌రెడ్డికి రిమాండ్ పొడిగింపు

**బలగం టీవీ, హైదరాబాద్**

లగచర్ల కేసు లో ఏ1 నిందితుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి రిమాండ్ ను కోర్టు పొడిగించింది. బుధవారంతో పట్నం నరేందర్ రిమాండ్ గడువు ముగియగా పోలీసులు కొడంగల్ కోర్టులో హాజరు పరిచారు. పట్నం నరేందర్ రెడ్డి రిమాండ్‌ను డిసెంబర్ 11 వరకూ పొడిగిస్తూ జూనియర్ సివిల్ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు. నవంబర్ 11న లగచర్లలో ఇండస్ట్రియల్ కారిడార్ భూ సేకరణపై రైతుల అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు వెళ్లిన వికారాబాద్ కలెక్టర్ పై అక్కడి రైతులు, ప్రజలు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి హస్తం ఉందని ఆరోపణలు రాగా పోలీసులు ఆయన్ను అరెస్ట్ చేసి కొడంగల్ మెజిస్ట్రేట్ లో హాజరు పరిచారు. 14 రోజుల రిమాండ్ విధించిన విషయం విదితమే.



## గుండెపోటుతో ఆర్మీ జవాన్ మృతి

**బలగం టీవీ, హైదరాబాద్**

మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ పట్టణంలోని యాదవ్ నగర్‌కు చెందిన ఆర్మీ జవాన్ కొదిరిపాక సతీశ్(34) గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సతీశ్ తండ్రి కనకయ్య చిన్నతనంలో మృతి చెందగా, తల్లి ఎల్లాబాయి అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నది. సతీశ్ డోర్నకల్‌లో 10వ తరగతి వరకు, ఖమ్మంలో పైచదువులు చదివాడు. ఆర్మీలో ఉద్యోగం సాధించాలని పట్టుదలతో చదివి 2011లో ఎంపికయ్యాడు. నాలుగేళ్ల క్రితం నర్సంపేటకు చెందిన లక్ష్మిని వివాహం చేసుకున్నాడు. కలకత్తా ఆర్మీ బేస్ క్యాంపులో ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం గుండెపోటు రావడంతో పశ్చిమ బెంగాల్ బాగ్ దోగారా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. సతీశ్ మృతితో కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగారు. ఆయన మృతదేహం 29వ తేదీ సాయంత్రం రానున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

# రవాణా శాఖలో పదోన్నతులు.. ఉత్తర్వులు జారీ !

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



: రాష్ట్ర రవాణా శాఖలో డీటీసీలకు జేటీసీలుగా, ఆర్టీఓలకు డీటీసీలుగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్‌గా పదోన్నతులు పొందిన మామిండ్ల చంద్ర శేఖర్ గౌడ్, శివ లింగయ్య డిప్యూటి ట్రాన్స్ పోర్ట్ కమిషనర్‌గా పదోన్నతులు పొందిన రవీందర్ కుమార్, వాణి,సదానందం,కిషన్, సురేష్ రెడ్డిలు గురువారం మంత్రి నివాసంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేసారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో సాధ్యమయ్యాయన్నారు. ఈ సందర్భంగా రవాణా శాఖ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్ కుమార్, తెలంగాణ గ్రూప్ 1 అధికారుల సంఘం అధ్యక్షుడు మామిండ్ల చంద్ర శేఖర్ గౌడ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భం గా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. వాహనదారులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చడంతో పాటు రహదారి భద్రతను పెంపొందించడానికి రవాణా శాఖ అధికారులు కృషి చేయాలని మార్గ నిర్దేశనం చేశారు.



మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. మహాత్మ పూలేకి నివాళులు అర్పించినవారిలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఇతరనేతలు ఉన్నారు.

# జార్ఖండ్ సీఎంగా హేమంత్ సోరెన్ ప్రమాణం

**బలగం టీవి, రాంచీ**



జార్ఖండ్ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ఆ రాష్ట్ర 14వ ముఖ్యమంత్రిగా జేఎంఎం చీఫ్ హేమంత్ సోరేన్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన చేత గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్ ప్రమాణం చేయించారు. ముఖ్యమంత్రిగా హేమంత్ ప్రమాణ స్వీకారం చేయడం ఇది నాలుగోసారి. రాంచీ లో జరిగిన ఈ కార్యక్రమానికి హేమంత్ సోరెన్ భార్య, పిల్లలు, తల్లిదండ్రులు షిబు సోరెన్, రూపి సోరెన్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, పశ్చిమ బెంగాల్ సీఎం మమత బెనర్జీ, తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్, ఆర్జేడీ నేత తేజశ్వి యాదవ్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, ఆయన భార్య సునితా కేజ్రీవాల్, ఎంపీ రాఘవ్ చద్దా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన హేమంత్ సోరెన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఇటీవలే జరిగిన ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 81 నియోజకవర్గాలకు గానూ జేఎంఎం కూటమికి 56 స్థానాలు, ఎన్డీయే కూటమికి 24 స్థానాలు లభించిన సంగతి తెలిసిందే.

# ఢిల్లీలో పేలుడు

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**



దేశ రాజధాని ఢిల్లీలో భారీ పేలుడు జరిగింది. రద్దీగా ఉండే ప్రశాంత్ విహార్‌లో ఓ స్వీట్ షాప్ వద్ద బాంబు పేలింది. పీవీఆర్ మల్టీప్లెక్స్ సమీపంలో పేలుడు జరగడం తీవ్ర కలకలం రేపింది. పేలుడు సమాచారంతో వెంటనే పోలీసులు రంగంలోకి దిగారు. అగ్నిమాపక సిబ్బంది కూడా అక్కడికి చేరుకున్నారు. పేలుడు జరిగిన ప్రాంతంలో తెల్లని పౌడర్ ను పోలీసులు గుర్తించారు. ఉదయం 11.48 గంటలకు పేలుడు జరగడంతో ఆ ప్రాంతంలో ఉన్న ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. పేలుడుకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. పేలుడుతో ప్రాణ నష్టం జరగలేదని అధికారులు స్పష్టం చేశారు. ఆ ప్రాంతంలో ఆటో పార్క్ చేసిన డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డారని పోలీసులు వివరించారు. పేలుడు జరిగిన తర్వాత ఆ ప్రాంతాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఆ ఏరియాను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. పేలుడుకు గల కారణం ఏంటి అని లోతుగా విచారిస్తున్నారు.

# ప్రజలు, పార్లమెంటును మోసం చేసిన సీఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

2013ను రాష్ట్రంలో అమలు చేస్తున్నామని కేంద్రానికి పచ్చి అబద్ధం చెప్పారని విమర్శించారు. హైడ్రా కూల్చిన ఇండ్లకు పరిహారం ఎలా చెల్లిస్తారు.. సీఎం రేవంత్‌ను నిలదీసిన హరీశ్‌రావు మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుపై వాస్తవాలను దాచిపెడుతుందని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. పార్లమెంట్‌ను రేవంత్ సర్కార్ తప్పుదోవ పట్టించడం సిగ్గుచేటు అని విమర్శించారు. రేవంత్ సర్కార్ కేంద్రానికి చెప్పిందొకటి.. ఇక్కడ చేస్తున్నది మరొకటి అని మండిపడ్డారు.నిర్వాసితులను ఆదుకోవడానికి 2013లో అప్పటి కేంద్ర ప్రభుత్వం భూసేకరణ చట్టం చేశారని హరీశ్‌రావు తెలిపారు. రాష్ట్రాలు ఇంతకంటే ఎక్కువ సహాయం చేయాలని అనుకుంటే సొంతంగా చట్టాలు చేసుకోవచ్చని కేంద్రం తెలిపిందని గుర్తుచేశారు. కేసీఆర్ కూడా నిర్వాసిత కుటుంబం నుంచి రావడంతో వారి గురించి ఆయన ఆలోచన చేసి మెరుగైన చట్టాన్ని అమలు చేశారని చెప్పారు. ఈ క్రమంలోనే కేసీఆర్ సర్కార్ 2014లో భూసేకరణ చట్టం తీసుకొచ్చిందని తెలిపారు. నిర్వాసితులకు 121 గజాల స్థలంలో ఐఏవై ఇల్లు కట్టించాలని 2013 చట్టం చెబుతుంటే.. కేసీఆర్ 250 గజాల స్థలం, డబుల్ బెడ్రూం ఇల్లు ఇచ్చేలా చట్టం చేసిందని పేర్కొన్నారు. నిర్వాసితులకు కేసీఆర్ డబుల్ బెనిఫిట్ కల్పించారని చెప్పారు. ఎలాంటి భూమి అయినా సరే నిర్వాసితులకు సమానమైన హక్కులు కల్పించారని తెలిపారు. కానీ ఇప్పుడు మూసీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరిస్తుందని విమర్శించారు.

నష్టపోతున్న బాధితులను నిర్ధారించడానికి క్షేత్ర స్థాయిలో సర్వే చేయాలని సూచించారు. 60 రోజుల సమయం ఇస్తూ ప్రముఖ పత్రికల్లో ప్రకటనలు ఇవ్వాలని తెలిపారు. ఆ తర్వాత మరో 30 రోజుల సమయం ఇవ్వాలన్నారు. వచ్చిన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని పరిష్కరించాలని తెలిపారు. అప్పుడు ప్రక్రియ ప్రారంభించాలని తెలిపారు. కానీ రేవంత్ సర్కార్ ఇవేమీ పాటించలేదని మండిపడ్డారు. ఇక్కడ నోటీసులు లేవు, డీపీఆర్ లేదు, ఎన్యుమరేషన్ లేదని తెలిపారు. ఇవేవీ లేకుండానే ఇండ్లు కూలగొట్టి, కేసీఆర్ కట్టించిన డబుల్ బెడ్రూం ఇండ్లను ఇచ్చారని పేర్కొన్నారు. మూసీ నిర్వాసితులు అత్యంత పేదలు అని హరీశ్‌రావు తెలిపారు. మూసీలో ఇండ్లు కూల్చేసి, బాధితులను డబుల్ బెడ్రూం ఇండ్లలో వేసిందని అన్నారు.

కేసీఆర్ నాయకత్వంలో కొండ పోచమ్మ సాగర్, మల్లన్న సాగర్ పాలమూరు ఎత్తిపోతలలోగానీ, సీతారామ ప్రాజెక్టులో గానీ అనేక ప్రాజెక్టుల్లో తాము తీసుకొచ్చిన 2014 భూసేకరణ చట్టం అమలు చేశామని హరీశ్‌రావు తెలిపారు. ఏ ఇల్లు అయినా ఆ ఇంటికి ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ అధికారులు వెళ్లి పాత ఇంటికి ఎంత విలువ ఉంటుందో అంచనా వేస్తారని.. దానికి రెండింతల డబ్బును యజమానికి ఇస్తారని తెలిపారు. 2014 చట్టం ప్రకారం ఇంట్లో పెళ్లయిన ప్రతి ఒక్కరినీ కుటుంబంగా గుర్తించాలని తెలిపారు. ప్రతి కుటుంబానికి ఏడున్నర లక్షలు పరిహారం ఇవ్వాలని పేర్కొన్నారు. నిర్వాసితులకు అన్ని సౌకర్యాలతో కాలనీ నిర్మించి ఇవ్వాలని చెప్పారు. పెళ్లికాని 18 ఏండ్లు నిండిన వాళ్లకు రూ.5 లక్షలు, పెళ్లయిన వారికి 250 గజాల స్థలం ఇవ్వాలని తెలిపారు. అమ్ముకోవడానికి హక్కులతో కూడిన ఇల్లు నిర్మించి ఇవ్వాలని సూచించారు. కానీ కేసీఆర్ కట్టించిన ఇండ్లను మూసీ బాధితులకు కేవలం అసైన్డ్ పేపర్ ఇచ్చి పంపించారని తెలిపారు. అంటే వారికి ఆ ఇండ్ల మీద ఎలాంటి హక్కులు ఉండవని స్పష్టం చేశారు.

ప్రజలు, పార్లమెంటును సీఎం రేవంత్ రెడ్డి మోసం చేశారని హరీశ్‌రావు ఆరోపించారు. ముఖ్యమంత్రి, మున్సిపల్ మంత్రి రేవంత్ రెడ్డే అని తెలిపారు. సంబంధిత శాఖ మంత్రి సంతకంతోనే పార్లమెంటుకు సమాధానం వెళ్తుందని పేర్కొన్నారు. అంటే ఆయనకు తెలిసి కూడా కేంద్రానికి తప్పుడు సమాచారం అందించారని మండిపడ్డారు. కొత్తగా ఇండ్లను కూల్చబోమని అంటున్నారని.. మరి కూల్చిన వాటి సంగతేంటని ప్రశ్నించారు. పసిపిల్లలపై కనికరం లేకుండా, కాళ్లపై వేడుకుంటున్నా ఆగలేదని గుర్తుచేశారు. వర్షం పడుతుంటే నడిరోడ్డుపై పడేశారని మండిపడ్డారు. వాళ్లు పడిన బాధ, క్షోభకు ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. హైడ్రా కూల్చిన ఇండ్లకు పరిహారం ఎట్ల చెల్లిస్తారని ప్రశ్నించారు. పరిహారం ఇచ్చేవరకు ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వదిలిపెట్టదని స్పష్టం చేశారు.

# స్కూళ్ల మూసివేతకు ప్రభుత్వం కుట్ర

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**


రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కారు పాఠశాలలను మూసివేసే కుట్ర చేస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. జీరో సూల్ పేరిట 1,899 సూళ్లు, 10 మందిలోపు విద్యార్థుల కారణంగా 4,314 సూళ్లను కలిపి 6,213 ప్రభుత్వ పాఠశాలలను శాశ్వతంగా మూసివేయాలని చూస్తున్నదని మండిపడ్డారు. ఇందులో భాగంగానే 5,741 మంది టీచర్లను బదిలీలు చేస్తున్నదని గురువారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. 'ప్రతి చిన్న గ్రామానికి ప్రాథమిక, ప్రతి రెవెన్యూ గ్రామానికి ప్రాథమికోన్నత, హైసూల్ చొప్పున ఏర్పాటు చేస్తామని అభయహస్తం మ్యానిఫెస్టోలో ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చి సంవత్సరం కాకముందే వేలాది స్కూళ్ల మూసివేయాలని చూస్తున్నదని ధ్వజమెత్తారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం కోసం 7,289 కోట్లతో మన ఊరు–మన బడి, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం సన్నబియ్యంతో పౌష్ఠికాహారం అందించిందని, రేవంత్ సరారు వచ్చీ రాగానే సీఎం బ్రేక్ ఫాస్ట్ సీం రద్దు చేయడం, మన ఊరు మన బడి ప్రోగ్రాంను కొనసాగించక, పురుగుల అన్నం, విషాహారంతో మధ్యాహ్న భోజనం వల్ల ప్రభుత్వ పాఠశాలల పరపతి తగ్గి ఎన్‌రోల్‌మెంట్ తగ్గుతున్నదని పేర్కొన్నారు.

# యూజీసీ కొత్త ప్రణాళిక

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు వెసులుబాటు కల్పించేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యుజిసి) ఒక కొత్త ప్రణాళికను రూపొందించింది. డిగ్రీ కోర్సులకు సంబంధించి ప్రస్తుతం ఉన్న నిర్ణీత కాల వ్యవధికి బదులుగా అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు ఇక తమ చదువును తక్కువ కాలంలో లేదా మరింత ఎక్కువ కాలంలో పూర్తి చేసేందుకు వీలుగా ఉన్నత విద్యా సంస్థలు అవకాశం కల్పించనున్నాయి. ఈ వారంలో జరిగిన సమావేశంలో అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం శీఘ్ర డిగ్రీ ప్రోగ్రామ్(ఎడిపి), పొడిగించిన డిగ్రీ ప్రోగ్రామ్(ఇడిపి) అందచేసేందుకు ఉన్నత విద్యా సంస్థన్పాటించాల్సిన నియమ నిబంధనలను యుజిసి ఆమోదించినట్లు యుజిసి చైర్మన్ జగదీష్ కుమార్ తెలిపారు. ఎడిపి లేదా ఇడిపి కింద కోర్సు పూర్తి చేసినప్పటికీ ప్రస్తుతం అమలులో నిర్ణీత కాల వ్యవధి డిగ్రీ కోర్సుకు సమానంగా వాటి అర్హత ఉంటుందని, పై చదువులకు, ఉద్యోగ నియామకాలకు ఈ డిగ్రీల విలువ అంతే సమానంగా ఉంటుందని ఆయన తెలిపారు. తమ అభ్యాస నైపుణ్యాల ఆధారంగా విద్యార్థులు తమ విద్యాభ్యాస కాల వ్యవధిని తగ్గించుకోవడం లేదా పెంచుకోవడం చేయవచ్చని ఆయన తెలిపారు. ఎడిపి ద్వారా విద్యార్థులు మూడేళ్ల లేదా నాలుగేళ్ల డిగ్రీని త్వరితంగా పూర్తి చేయవచ్చని, వారికి ప్రతి సెమిస్టర్‌కు అదనపు క్రెడిట్స్ ఉంటాయని ఆయన తెలిపారు. అదే విధంగా ఇడిపి కింద విద్యార్థులు తమ డిగ్రీ కాల వ్యవధిని పొడిగించుకోవచ్చని, వారికి ప్రతి సెమిస్టర్‌కు తక్కువ క్రెడిట్స్ పడతాయని ఆయన వివరించారు. ఈ ప్రోగ్రామ్స్‌కు అర్హులయ్యే విద్యార్థులను నిర్ణయించేందుకు ఉన్నత విద్యా సంస్థలు కమిటీలను ఏర్పాటు చేస్తాయని తెలిపారు.

# భారత జట్టుకు ఆస్ట్రేలియా ప్రధాని విందు



**బలగం టీవి, మెల్‌బోర్న్**

భారత క్రికెట్ జట్టు బోర్డర్ గావస్కర్ సిరీస్ కోసం ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. అయితే గురువారం దేశ రాజధాని క్యాన్‌బెరాలో.. ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్.. భారత క్రికెట్ బృందానికి పార్లమెంట్‌లో విందు ఇచ్చారు. ఈ నేపథ్యంలో రోహిత్‌సేన నేతృత్వం లోని భారత బృందం ప్రధాని ఆల్బనీస్‌ను కలిసింది. జట్టు సభ్యులను కెప్టెన్ రోహిత్ శర్మ .. ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బనీస్‌కు పరిచయం చేశారు. పెర్త్ టెస్టులో విజయం సాధించిన భారత క్రికెటర్లను ప్రధాని ప్రశంసించారు. బుమ్రా, కోహ్లీని ప్రత్యేకంగా మెచ్చుకున్నారు. ఈ క్రమంలో కెప్టెన్ రోహిత్ శర్మ ఆస్ట్రేలియా పార్లమెంట్‌లో స్పీచ్ ఇచ్చాడు.



ఇరుదేశాల మధ్య బలమైన సంబంధాలను కెప్టెన్ రోహిత్ శర్మ ప్రశంసించాడు. ఆస్ట్రేలియా క్రికెట్ అభిమానుల స్ఫూర్తి, పోటీతత్వం బాగుంటుందని అన్నాడు. అందుకే ప్రపంచ క్రికెట్‌లో ఏ జట్టైనా ఆస్ట్రేలియాకు వచ్చి సిరీస్ ఆడేందుకు ఇష్టపడుతుందని పేర్కొన్నాడు. 'భారత్–ఆస్ట్రేలియా మధ్య ఎన్నో ఏళ్లుగా క్రీడా, వాణిజ్యంలో సత్సంబంధాలు ఉన్నాయి. ఆస్ట్రేలియాకు వచ్చి ఇక్కడ క్రికెట్ ఆడడాన్ని మేం ఆస్వాదిస్తాం. ఆసీస్‌తో క్రికెట్ ఆడడం ఎప్పుడూ ఛాలెంజింగ్‌గా ఉంటుంది' అని అన్నాడు.

మరోవైపు నవంబర్ 30వ తేదీ నుంచి ప్రైమ్ మినిస్టర్ లెవన్ జట్టుతో ఇండియా రెండు రోజుల పింక్ బాల్ ప్రాక్టీసు మ్యాచ్ ఆడనున్నది. మనూకా ఓవల్ మైదానంలో ఆ మ్యాచ్ జరగనున్నది. డిసెంబర్ 6వ తేదీ నుంచి ప్రారంభంకానున్న రెండవ టెస్టుకు.. ప్రాక్టీస్ మ్యాచ్ దోహదపడనున్నది. జాక్ ఎడ్వర్డ్స్ నేతృత్వంలోని ప్రైమ్ మినిస్టర్స్ లెవన్ జట్టు కూడా ప్రధాని ఆల్బనీస్‌ను కలిసింది.

# షమీకి బీసీసీఐ డెడ్‌లైన్..!

- ఆ రెండు పరీక్షలు దాటితేనే..

**బలగం టీవి, ముంబై**

సీనియర్ పేసర్ మహమ్మద్ షమీకి బీసీసీఐ వారం రోజుల డెడ్ లైన్ విధించింది. ఈ లోపు షమీ తన ఫిట్ నెస్ ను నిరూపించుకోవాల్సి ఉంది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ జట్టులో స్థానం సంపాదించాలంటే ఈ ఆటగాడు మరో రెండు కఠిన పరీక్షలను సైతం దాటుకుని ముందుకు వెళ్లాల్సి ఉందని బీసీసీఐ షరతులు విధించినట్టు తెలుస్తోంది.

గాయం నుంచి కోలుకున్న షమీ ఇటీవల బెంగాల్ తరపున రంజీ మ్యాచ్‌లో ఆడాడు. ఆ మ్యాచ్‌లో అతను మెరుగ్గానే బౌలింగ్ చేశాడు. ప్రస్తుతం జరుగుతున్న సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో కూడా ఆడుతున్నాడు. షమీ పర్ఫార్మెన్స్ బాగానే ఉన్నా.. బీసీసీఐ మాత్రం అతనికి కొన్ని కండీషన్స్ పెట్టింది. అతడి ఆరోగ్యాన్ని బీసీసీఐ వైద్య బృందం తీవ్రంగా పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. అయితే, గాయం కారణంగా లభించిన విశ్రాంతి వల్ల షమీ కాస్త బరువు పెరిగాడు. ఫిట్ నెస్ విషయంలోనూ తిరిగి పుంజుకోవాల్సిన అవసరం ఉందని బీసీసీఐ భావిస్తోంది. దీంతో



ఈ రెండు పరీక్షలు దాటి షమీ నిరూపించుకోగలిగితేనే అతడు బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ తదుపరి మ్యాచ్ లో ఆడే అవకాశం లభించనుంది.

ఫిబ్రవరిలో జరగనున్న ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని దృష్టిలో ఉంచుకుని షమీకి ఇప్పుడప్పుడే అవకాశాలు ఇవ్వకపోవచ్చునని క్రికెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. షమీ పూర్తిగా కోలుకుంటే, అతను డిసెంబర్ 14 నుండి ప్రారంభమయ్యే మూడో టెస్టు నుండి ఆడే అవకాశాలున్నాయి.

# ఆరెంజ్ ఆర్మీ ప్రేమ ఎప్పటికీ మరిచిపోలేను..

- టీమిండియా పేసర్ భువనేశ్వర్ కుమార్

**బలగం టీవి, హైదరాబాద్**

టీమిండియా పేసర్ భువనేశ్వర్ కుమార్‌కు సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఉన్న 11 ఏళ్ల బంధానికి ముగింపు పలికాడు. ఇన్నాళ్లు సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడిన ఈ ప్లేయర్.. వచ్చే సీజన్ నుంచి మాత్రం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు తరపున ఆడనున్నాడు. వేలంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు రూ.10.75 కోట్లకు అతడిని దక్కించుకుంది. 2014లో భువనేశ్వర్‌ను ఎస్‌ఆర్‌హెచ్ రూ.4.25 కోట్లకు దక్కించుకుంది.

ఈ నేపథ్యంలో స్టార్ ఫాస్ట్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ భావోద్వేగానికి గురయ్యాడు. ఎస్‌ఆర్‌హెచ్‌ను వీడినప్పటికీ.. ఆరెంజ్ ఆర్మీతో ప్రేమ కొనసాగుతుందని భువీ పేర్కొన్నాడు. సన్‌రైజర్స్ అభిమానుల ప్రేమ ఓ అద్భుతమని తెలిపాడు.

"సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో 11 ఏళ్ల అద్భుత ప్రయాణం తర్వాత గుడ్ బై చెప్పే సమయం వచ్చింది. ఎస్‌ఆర్‌హెచ్‌తో ఎన్నో మరుపురాని అనుభూతులు, తిరుగులేని విజయాలు ఉన్నాయి. ఇక్కడ ఓ అద్భుతమైన



విషయం.. అభిమానుల ప్రేమ. మీ మద్దతు నిరంతరం కొనసాగింది. మీ ప్రేమ, మద్దతును నాతో ఎప్పటికీ కొనసాగిస్తాను" అని భువనేశ్వర్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నాడు.

# బచ్చలమల్లి టీజర్ విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**




టాలీవుడ్ హీరో అల్లరి నరేశ్ నటిస్తోన్న తాజా చిత్రం బచ్చలమల్లి. ఈ మూవీలో అమృత అయ్యర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాకు సోలో బ్రతుకే సో బెటర్' ఫేమ్ సుబ్బు మంగదేవి దర్శకత్వం వహిస్తున్నారు. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 20న థియేటర్లలో సందడి చేయనుంది. ప్రమోషన్స్‌లో భాగంగా టీజర్ విడుదల చేశారు మేకర్స్.

"కావేరి నీతో మాట్లాడాలి.. నాకు సిగరెట్ అలవాటుంది.. మందు అలవాటుంది.. అప్పుడప్పుడు అమ్మాయిల అలవాటు కూడా ఉంది.." అంటూ అల్లరి నరేశ్ హీరోయిన్‌కు చెప్పే డైలాగ్స్‌తో షురూ అయింది టీజర్. "మీ నాన్నేదో నిన్ను గొప్పోడిని చేయాలనుకుంటే నువ్వేంట్రా ఇలా యెధవలా తయారయ్యావ్' అని అంటాడు రావు రమేశ్. నేను ఎవ్వరి కోసం మారను. నాకు నచ్చినట్టు బతుకుతా అంటూ సాగుతున్న సీన్లు బచ్చలమల్లి క్యారెక్టర్ ఎలా ఉండబోతుందో చెబుతూ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. హాస్యా మూవీస్ బ్యానర్‌పై రాజేశ్ దండా, బాలాజీ గుప్తా సంయుక్తంగా తెరకెక్కిస్తున్న ఈ మూవీకి విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నాడు. రావు రమేశ్, హరితేజ, ప్రవీణ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.



# పుష్ప సెన్సార్ పూర్తి.. ఐదు కట్‌లు..

**బలగం టీవి, హైదరాబాద్**

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా సుకుమార్‌దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'పుష్ప2: ది రూల్'. ఈ సినిమా డిసెంబర్ 5న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా సెన్సార్ పూర్తయింది. దాంతో సెన్సార్ సర్టిఫికెట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతూ వైరల్ అవుతోంది. సెన్సార్ బోర్డు సర్టిఫికెట్‌లో మొత్తం ఐదు విషయాల్లో మార్పు చేర్పులు చెప్పింది. 'రండి' అనే పదాన్ని మరొక పదంతో మార్చగా, మరో అసభ్య పదాన్ని మ్యూట్ చేయమని సూచించింది. ఇక వెంకటేశ్వర్ అనే మాటను భగవంతుడుగా మార్చమన్నది. విలన్ కాలుని హీరో నరకగా అది గాలిలో ఎగిరే సీన్, నరికిన చేతిని హీరో పట్టుకునే సన్నివేశాలను సీజీతో కవర్ చేయమని చెప్పింది. ఇక సినిమా నిడివి విషయానికొస్తే 3 గంటలా 20 నిమిషాల38 సెకన్లతో సినిమా రాబోతోంది.

# గేమ్ ఛేంజర్ నుంచి నానా హైరానా ..

**బలగం టీవి, హైదరాబాద్**

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'గేమ్ ఛేంజర్'. ఈ చిత్రం 2025 సంక్రాంతికి రానుంది. ఈ క్రమంలో మేకర్స్ తాజాగా ఈ సినిమా నుంచి ఓ ఫీల్ గుడ్ మెలోడీ సాంగ్‌ను రిలీజ్ చేశారు. 'నానా హైరానా' అంటూ సాగే ఈ పాటను కార్తిక్, శ్రేయా ఘోషల్ పాడారు. తమన్ బాణీలు అందించిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి చక్కటి సాహిత్యాన్ని అందించారు. ఈ మూవీలో చరణ్‌తో పాటు అంజలీ, యస్ జే సూర్య, శ్రీకాంత్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని శ్రీ వేంకటేశ్వర బ్యానర్‌పై దిల్‌రాజు భారీ బడ్జెట్‌తో తెలుగు, తమిళం, హిందీ భాషల్లో నిర్మించారు. భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటోన్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 10న రిలీజ్ కానుంది.

